క్లుప్తంగా

పాఠశాలల అభివృద్ధి పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న అధికారులు

తాండూర్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను జిల్లా సెక్టోరల్ అధికారుల బృందం శుక్రవారం పరిశీలించింది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా నిర్వహిస్తున్న పనులను బృందం నిశితంగా పరిశీలన చేసింది. బోయపల్లి, చౌటపల్లి, రేపల్లెవాడ, రేచినీరోడ్, కిష్టంపేట, కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఆయాచోట్ల జరుగుతున్న పనుల నాణ్యతను పరిశీలించారు. అభివృద్ధి పనులను ఈనెలాఖరులోగా పూర్తిచేయాలని అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ చైర్మన్లు, హెచ్ఎంలను ఆదేశించారు. జిల్లా సెక్టోరల్ అధికారులు యశోధర, సత్యనారాయణ మూర్తి, పాఠశాలల చైర్మన్లు, హెచ్ఎంలు, సీసీఓ ప్రశాంత్ ఉన్నారు.

పశువులకు వడదెబ్బ తగలకుండా చూడాలి


ముల్కల్లలో పశువైద్య సహాయ కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా పశువైద్యాధికారి రమేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వేసవిలో ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున పశువులు వడదెబ్బ బారిన పడకుండా చూసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి వై.రమేశ్ పశు యజమానులకు సూచించారు. మండలంలోని ముల్కల్ల, రాపల్లి గ్రామాల్లోని పశు వైద్య సహాయకేంద్రాలను శుక్రవారం పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఎండలు ఎక్కువగా ఉన్నందున పశువులను ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు మాత్రమే మేతకు పంపాలని తెలిపారు. పశువులు వడదెబ్బకు గురైతే చల్లని గాలి వీచే ప్రదేశంలోకి తీసుకెళ్లి నీళ్లతో కడగాలన్నారు. మండల పశువైద్యాధికారి శాంతిరేఖ, సిబ్బంది ఉన్నారు.

అక్రమ వెంచర్లపై కొరడా


ఊత్కూరులో వెంచర్లను తొలగిస్తున్న అధికారులు

లక్సెట్టిపేట: మున్సిపల్ పరిధిలో అనుమతి లేకుండా వేసిన అక్రమ వెంచర్లను అధికారులు శుక్రవారం తొలగించారు. వ్యవసాయ భూములు కొనుగోలు చేసి వెంచర్ల కోసం ఏర్పాటు చేసిన హద్దురాళ్లు తొలగిస్తున్నట్లు తెలిపారు. ఊత్కూరు సమీపంలో, గురుకుల పాఠశాల ప్రదేశంలో అనుమతి లేకుండా వెలసిన అక్రమ వెంచర్లను ట్రాక్టర్లతో తొలగించారు. మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

హాస్టల్ భవనం పరిశీలన


పరిశీలిస్తున్న డీఈవో యాదయ్య

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాల హాస్టల్ భవనాన్ని డీఈవో యాదయ్య శుక్రవారం పరిశీలించారు. హాస్టల్ భవనం నిర్మాణం పూర్తయిన, ప్రారంభించకపోవడంతో శిథిలావస్థకు చేరిందని, వెంటనే మరమ్మతు చేపట్టాలన్నారు. వచ్చే విద్యాసంవత్సరంలోగా హాస్టల్‌ను ప్రారంభించాలన్నారు. ఆయన వెంట ఎంఈవో రవీందర్, తదితరులు ఉన్నారు.

పోలీసు కవాతు



దండేపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా దండేపల్లిలో శుక్రవారం సాయంత్రం పోలీసు కవాతు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. దండేపల్లి, లక్సెట్టిపేట పోలీసు సిబ్బంది, సీఆర్పీఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

● ఉక్కపోత తట్టుకోలేక..



మంచిర్యాలటౌన్: జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు వేడికి తట్టుకోలేకపోతున్నారు. ఎండవేడికి కేంద్రాలకు సగం మంది చిన్నారులు, గర్భిణులు రావడం లేదు. గదుల్లో ఫ్యాన్లు ఉన్నా, వేడి గాలికి తట్టుకోలేక, ఆరు బయట నీడలో ఉండి ఆటపాటలతో గడుపుతూ, మధ్యాహ్న భోజనం అనంతరం ఇంటికి వెళ్లిపోతున్నారు. కేంద్రాలకు రాలేని వారికి ఇంటికే పౌష్టికాహారం పంపించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

● 'అంగన్‌వాడీ'లో కూర్చున్న చిన్నారులు



భీమారం: మండల కేంద్రంలోని ఇప్పలబొగుడ అంగన్‌వాడీ కేంద్రంలో కనీస వసతులు లేవు. కూర్చునేందుకు కుర్చీలు లేక చిన్నారులు కిందనే కూర్చుంటున్నారు. కేంద్రంలో వెంటిలేషన్ లేకపోవడం, ఫ్యాన్లు లేక తలుపుల వద్ద కూర్చోని పిల్లలు భోజనం చేస్తున్నారు.

● వరండాలో నిద్ర



వేమనపల్లి: ఎండవేడికి అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు అల్లాడిపోతున్నారు. ఉదయం 10 గంటలకే వడగాడ్పులు హడలెత్తిస్తున్నాయి. మండలంలో 33 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా ఉదయం పూట అంగన్‌వాడీ కేంద్రాలు తెరుస్తున్నారు. శుక్రవారం వేమనపల్లి, గొర్లపల్లి, కాటేపల్లి, గ్రేగూడెం కేంద్రాలను పరిశీలించగా చిన్నారులు 10.30 నిమిషాలకు ఇళ్లకు వెళ్లిపోయారు. బాలమృతం పంపిణీ చేసినట్లు అంగన్‌వాడీ టీచర్లు చెబుతున్నారు. చిన్నారులు ఎండ వేడిమి తట్టుకోలేక వరండాపై కునుకు తీశారు.

నాణ్యమైన పనిముట్లు అందించాలి


కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: భూగర్భ గనుల్లో కార్మికులకు నాణ్యమైన పనిముట్లు అందించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచి సెక్రెటరీ ఎస్కే బాజీసైదాలు ఆర్కే న్యూటెక్ గనిని సందర్శించి కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కాలం చెల్లిన ఎస్‌డీఎల్ యంత్రాలు వాడడం వల్ల ఆపరేటర్లపై పని భారం పెరుగుతుందన్నారు. వాటి స్పేర్స్ కూడా సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. లైన్‌మెన్ కార్మికుల కొరత మూలంగా ఉన్నవారిపై పని భారం పెరుగుతుందన్నారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న సందర్భంగా ఓపెన్ కాస్ట్, సీహెచ్‌పీల్లో పనిచేసే కార్మికులకు షిఫ్ట్‌వేళలు మార్చాలని డిమాండ్ చేశారు. ఇంకా ఇతర సమస్యలు పరిష్కరించాలని లేకపోతే శనివారం నల్లబ్యాడ్జీలతో నిరసన, సోమవారం అర్ధనగ్న ప్రదర్శన కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శి సంపత్, ఫిట్ సెక్రెటరీ ఆకుల లక్ష్మణ్, కాంట్రాక్ట్ కార్మికుల సంఘం రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, నాయకులు చంద్రమౌళి, వెంకటేశం, సకినాల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి తిప్పలు!

- పట్టణంలోని పలు ప్రాంతాల్లో లీకవుతున్న నీరు
- వృథా చేయొద్దంటున్న అధికారులు


కాలనీల్లో రోడ్లపై పారుతున్న వైనం

మంచిర్యాలటౌన్: ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో జలాశయాలు అడుగంటిపోగా, బోర్లు ఎండిపోయి నీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దీంతో అప్రమత్తమైన అధికారులు నీటిని వృథా చేయొద్దని కోరుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రతిరోజూ నీటిని సరఫరా చేసే ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద నీటి నిల్వలు తగ్గిపోవడంతో ఇబ్బందిగా మారుతోంది. ప్రజల అవసరం మేరకు నీటిని పట్టుకుని, కుళాయిని ఆపేయాలని మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఇటీవల ప్రకటన విడుదల చేశారు. కాలనీల్లో పైపులు లీకేజీతో నీరు రోడ్లపై పారుతోంది. కాలనీ ప్రజలు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. మరో నెలన్నర రోజుల పాటు తీవ్ర ఎండలు, ఉష్ణోగ్రతలు పెరిగి నీటి అవసరాలు పెరుగుతాయి. వేసవిలో నీటి ఇబ్బందులు కొంతవరకైనా తగ్గించేందుకు అవకాశం ఉంది. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో 27,152 ఇళ్లు ఉండగా, 13,220 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. మున్సిపల్ నల్లాలతోపాటు, భగీరథ నల్లా కనెక్షన్లు 5,152 వరకు ఉండగా, వీటి ద్వారానే తాగునీటి సరఫరా చేస్తున్నారు. పైపులు అక్కడక్కడా తరచూ పగిలిపోయి లీకేజీ అవుతున్నా, మరమ్మతు చేపట్టకపోవడం వల్ల, నీటి వృథా నిత్యం జరుగుతూనే ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల సందర్శన

జన్నారం: మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలను డీఈవో యాదయ్య శుక్రవారం సందర్శించారు. జాబిగూడ, మన్నెగూడ, అక్కెపల్లిగూడ, జన్నారం, కొత్తపల్లి, కలమడుగు గ్రామాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాలలను సందర్శించి పలు సూచనలు చేశారు. పాఠశాలలోని సమస్యలను తెలియజేసి వాటికి మరమ్మతు చేపట్టాలని సూచించారు.

విద్యార్థికి సన్మానం

కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎల్కూచీ రఘు పది పరీక్ష ఫలితాల్లో 9.8 జీపీఏ సాధించగా, ఆయనను డీఈవో యాదయ్య సన్మానించారు. ఆంగ్ల మాధ్యమంలో వంద శాతం సాధించిన ఉపాధ్యాయులను హెడ్‌మాస్టర్ రాజమౌళిని అభినందించారు. ఆయన వెంట ఎంపీడీవో శశికళ, తదితరులు ఉన్నారు.

కళాశాలలను తరలించొద్దు

మంచిర్యాలఅర్బన్: నిబంధనలకు విరుద్ధంగా ఓ చోట అనుమతులు పొంది మరో ప్రాంతానికి కళాశాలలను తరలించొద్దని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డీఐఈవో శైలజకు వినతిపత్రం అందజేశారు. ఇష్టానుసారంగా కళాశాలల తరలింపుతో అక్కడ చదువుకున్న విద్యార్థులు సర్టిఫికెట్లు కోసం ఏదైనా ధ్రువపత్రం కోసం ఎక్కడికి వెళ్లాలో అర్థం కాని పరిస్థితి ఉంటుందని దృష్టికితెచ్చారు. లక్సెట్టిపేటలో ఇదే మాదిరిగా ఓ కళాశాలను తరలించే ఏర్పాట్లు చేస్తున్నారని, అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఇందల్, యువరాజ్, వంశీ, ప్రవీణ్, రాజేష్, గోపాల్, సంతోష్, శివతేజ పాల్గొన్నారు.

పనులు సత్వరం పూర్తి చేయాలి

భీమారం: అమ్మ ఆదర్శపాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు సత్వరం పూర్తిచేయాలని జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలల భవనాలకు మరమ్మతుతోపాటు విద్యుద్దీకరణ, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లని ఏర్పాట్లు చేసే పనులు నడుస్తున్నాయన్నారు. ఎంపీడీవో రాధారాథోడ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్, జీపీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నిరంగాల్లో రాణించాలి

భీమిని: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్ అన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలో వయోజన విద్యాశాఖ సఖీ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నడుస్తున్న అక్షరాస్యత కుట్టు శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కేంద్రంలో చదువుతోపాటు కుట్టుశిక్షణ నేర్చుకుంటున్న మహిళలను అభినందించారు. కుట్టు శిక్షణ పొందాక ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాంలను కుట్టే బాధ్యత అప్పగిస్తామన్నారు. 'విద్యాశాఖ అధికారి పురుషోత్తంనాయక్, డీఆర్పీలు రమేశ్, శిక్షణ కేంద్ర నిర్వాహకురాలు శారద, శిక్షకురాలు నిఖిత తదితరులు పాల్గొన్నారు.

నియామకం

దండేపల్లి: బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వనపర్తి రాకేశ్, తోట రమణయ్యలను నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య తెలిపారు. జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఆదేశాల మేరకు వారిని నియమించినట్లు పేర్కొన్నారు.

రేపు కార్యకర్తల సమావేశం

పాతమంచిర్యాల: జిల్లాకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లాలోని ముఖ్యకార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

ఇండియా కూటమిదే ముందంజ


మాట్లాడుతున్న చెన్నూరు ఎమ్మెల్యే వివేక్


గూడెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: దేశంలో తొలి, రెండవ విడతలో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి ముందంజలో ఉందని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణకు మద్దతుగా వివేక్ మాట్లాడారు. తెలంగాణ వచ్చేనాటికి సింగరేణిలో 62 వేల ఉద్యోగాల నుంచి 39 వేలకు తగ్గాయని, కొప్పుల ఈశ్వర్ సింగరేణి కార్మికులకు చేసిందేమి లేదన్నారు. 23 వేల ఉద్యోగాలను తొలగిస్తే కార్మికుల తరుపున ఏనాడు మాట్లాడలేదన్నారు. సింగరేణి కార్మికుల ఐటీ రీయింబర్స్‌మెంట్‌కు సీఎం రేవంత్ ఒప్పుకున్నారని, త్వరలోనే ప్రకటన చేయిస్తామని, సింగరేణి కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తామన్నారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణికి గత పదేళ్లుగా కేసీఆర్ చేసిందేమి లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత తాడిచర్ల మైన్‌ను సింగరేణి ఆధ్వర్యంలో ప్రారంభించేందుకు హామీని ఇచ్చారని సీఎం తెలిపారు. ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించి, పెద్దపల్లి ఎంపీగా వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలపించాలని కోరారు. ఐఎన్టీయూసీ జాతీయ కార్యదర్శి బి.జనక్‌ప్రసాద్, మునీర్, బాబన్న పాల్గొన్నారు.

వంశీకృష్ణను గెలిపించాలి..

దండేపల్లి: పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. దండేపల్లి మండలం గూడెం, నంబాల, వెల్గనూర్, కాసిపేట, కొండాపూర్, ద్వారక, ధర్మారావుపేట, పెద్దపేట, లక్ష్మీకాంతపూర్ గ్రామాల్లో వంశీకృష్ణకు మద్దతుగా శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రచారం

భీమారం: పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణని గెలిపించాలని కోరుతూ మండలంలోని నర్సింగాపూర్, పోతన్‌పల్లి, భీమారంలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు పోడేటి రవి, బుక్యా లక్ష్మణ్ , ఉస్కమల్ల శ్రీనివాస్, కామెర రాములు, అర్కాల రమేశ్, అశోక్‌యాదవ్ పాల్గొన్నారు.

బీజేపీతోనే దేశ అభివృద్ధి


శ్రీరాంపూర్: కార్మికులతో మాట్లాడుతున్న గోమాస శ్రీనివాస్

నస్పూర్: బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లితో కలిసి పట్టణంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. సీసీసీ కార్నర్ నుంచి శ్రీరాంపూర్ బస్టాండ్, కొత్తరోడ్, కృష్ణాకాలనీ, సీసీసీ టౌన్‌షిప్, నస్పూర్ కాలనీ మీదుగా తెలంగాణ తల్లి విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని కోరారు. నాయకులు అందుగుల శ్రీనివాస్, కమలాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో బీజేపీ నేతలు శుక్రవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ ఎంపీ అభ్యర్థి గోమస శ్రీనివాస్ తరపున కాంటా చౌరస్తా, బజారు ఏరియా, పురవీధుల్లో, షాపుల్లో ప్రచారం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, మాజీ ఎమ్మెల్యే అమురాజుల శ్రీదేవి కార్యకర్తలతో కలిసి షాపులకు వెళ్లి కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రమేశ్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, జిల్లా కార్యదర్శి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: బీజేపీని గెలిపిస్తే రాష్ట్ర ప్రభుత్వంతో కార్మికులకు ఆదాయ పన్ను మాఫీ చేయడానికి కృషి చేస్తామని పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన ఆర్కే 5 గనిపై కార్మికులను కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం, కోట్ల రూపాయలను కేంద్రానికి పన్ను రూపంలో కడుతుందని, అందులో నుంచి కొంత వెచ్చించిన ఐటీ రీయింబర్స్‌మెంట్ చేయవచ్చన్నారు. సింగరేణి కొత్త గనులు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్, బ్రాంచి కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సత్రం రమేశ్, ప్రధాన కార్యదర్శి ఈర్ల సదానందం, నాయకులు కమలాకర్ రావు, శ్రీకాంత్, మొగిలి, రాయమల్లు, శంకర్ పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: అంగ్రాజ్‌పల్లి గ్రామంలో బీజేపీ నేతలు ప్రచారం నిర్వహించారు. పార్టీ ఎంపీ గోమాస శ్రీనివాస్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఉపాధి పనుల వద్దకు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు.

బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి


వడ్డెర కాలనీలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. జిల్లా కేంద్రంలోని 28వ వార్డులోని వడ్డెర కాలనీలో శుక్రవారం ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీలు ప్రజా సంక్షేమాన్ని మరిచిందాన్నరు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ని గెలిపిస్తే, ప్రజలకు అందాల్సిన సంక్షేమాలు, అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అంకం నరేశ్, నాయకులు గోగుల రవీందర్‌రెడ్డి, మహ్మద్ తాజుద్దీన్, కర్ర శంకర్, మహ్మద్ రఫి, బాపు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం

కాసిపేట: మండలంలోని కొండాపూర్‌లో శుక్రవారం బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు ధర్మయ్య, సుధాకర్‌రెడ్డి, రాజాగౌడ్, సుమన్‌గౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా ఎన్నికల ప్రచారం

చెన్నూర్: మున్సిపాలిటీలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారం జోరందుకుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలల నాయకులు పోటాపోటీగా ప్రచారం చేస్తున్నారు. పార్టీల అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం సాగిస్తున్నారు. చెన్నూర్ కొత్తగూడెం కాలనీలో పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని నాయకులు కోరారు. బ్రాహ్మణవాడలో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ తరపునను బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేశారు. కాంగ్రెస్ నాయకులు చెన్న సూర్యనారాయణ, సుశీల్‌కుమార్, జక్కుల సత్యనారాయణగౌడ్, సుశీల్‌కుమార్, చింతల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు రాంలాల్ గిల్డా, రాంమోహన్ పాల్గొన్నారు.

రేపు హోమ్ ఓటింగ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల పరిధిలోని 17 పంచాయతీల్లో 5వ తేదీ ఆదివారం హోమ్ ఓటింగ్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సతీశ్ ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలో 85 ఏళ్లు పైబడిన వారితోపాటు దివ్యాంగులు మొత్తంగా 26 మంది హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. అర్హులు ఆదివారం ఓటు వేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

మజ్జిగ పంపిణీ

మందమర్రిరూరల్: మండలంలోని అందుగులపేట పంచాయతీ పరిధిలోని ఉపాధి కూలీలకు కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు కదారి జీవన్‌కుమార్ శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల్లో ప్రచారంలో భాగంగా ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి 250 మంది కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు.కుమార్, రాజ య్య, శేఖర్, రాజేష్, కార్తీక్, సందీప్, భాస్కర్ ఉన్నారు.

ఘనంగా ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ వేడుకలు


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: ఐఎన్‌టీయూసీ 77వ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక యూనియన్ కార్యాలయంతోపాటు సీహెచ్‌పీలో జెండాలను ఆవిష్కరించారు. అనునిత్యం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ వారికి ఎన్నో హక్కులను సాధించిపెట్టిన యూనియన్ ఐఎన్‌టీయూసీ అని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి ఉపాధ్యక్షుడు తేజావత్ రాంబాబు, శనిగారపు రాములు, ఆకుల రాజన్న, గోపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు


బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న సీఐ, సిబ్బంది

నస్పూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంచిర్యాల పోలీసులు జిల్లా కేంద్రంలో శుక్రవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, ప్రధాన కూడళ్ల వద్ద సీఐ బన్సీలాల్ నేతృత్వంలో తనిఖీ చేశారు. అనుమానితులను విచారించారు. పరిమితికి మించి నగదు సరఫరా, మద్యం తరలింపు తదితర వాటిపై నిఘాను పోలీసులు పెంచారు.

ఆత్మీయ సమ్మేళనం



కోటపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1989–90, 2003–04 బ్యాచ్‌లకు చెందిన పదో తరగతి విద్యార్థులు శుక్రవారం కలుసుకున్నారు. పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఒకరికొకరు యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తీపి గుర్తులను నెమెరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.